రమాయణం

**తెలుగు భాష అంటే.. మాకు విపరీతమైన ఇష్టం, ఆసక్తి ఉండేది! అందుకు మొదటి కారణం మా అమ్మ అయితే.. ఆ తరువాత మా తెలుగు సార్లే కారణం! మాకు హైస్కూల్లో భండారు సదాశివరావు సార్ తెలుగు బోధించేవారు. ఆయన ఎంత అద్భుతంగా పాఠం చెప్పేవారంటే.. మేం మళ్లీ చదవకపోయినా, ఆ పాఠాల సారాంశం మా బుర్రల్లో నిక్షిప్తమై ఉండేది.**

# మా తెలుగు గురువులకు.. మళ్లీ దండాలు!

ఎనిమిదో తరగతిలో 'కాళీయ మర్దనము' అనే పద్యభాగ పాఠం ఆయన రెండువారాలు చెప్పారు. అందులో..

'యమునా వీచి మృదంగ వాయు ధ్వనుల్ మ్రోయన్ తీర గోపా/ ఘ మనోజ్ఞ హర్షంబు గేయంబుగా చంచత్ కాళీయ వ్యాళ భో/ గ మహా రంగస్థలంబునన్ పటుగతిన్ కంజాక్షు నిర్మర్ద నాట్యంబు హృద్యాద్భుత/ భీమమై పరగ దివ్య శ్రేణిన్ చూచెన్ దివిన్' అనే పద్యమొక్కటే రెండు రోజులు చెప్పారు.

యమునా నది అలలు మ్రోగుతున్న మృదంగ వాద్యాల్లా, ఒడ్డున నిలబడి చూస్తున్న గోపాలుర గుంపు సంతోషంతో పెడ్తున్న కేకలు పాటగా, కదులుతున్న తోకతో, విప్పారి చలిస్తున్న కాళీయుని పడగ విశాలమైన రంగస్థలంగా, తామర రేకుల వంటి కన్నులు కలిగిన ఆ శ్రీకృష్ణుడు వేగంగా చేస్తున్న నాట్యం ఎంతో హృద్యంగా, అద్భుతంగా, భయంకరంగా తోచగా ఆకాశంలో దేవతలంతా వరుసగా నిలబడి చూశారట. ఈ పద్యమే కాదు.. సుభాషితాలు గానీ, ఇంకే పాఠంగానీ ఆయన ఎంతో వర్ణించి చెప్పే విధానం వల్ల మాకు ఈనాటికీ గుర్తుండిపోయాయి.

అలాగే మాకు తొమ్మిది, పదో తరగతుల్లో నరసింహమూర్తి గారు తెలుగు బోధించేవారు. ఎంతో సింపుల్‌గా ఉండే ఆయన సౌమ్యంగా మాట్లాడేవారు. ఆడపిల్లల్ని కూడా 'నాయినా! ఏదన్న అర్థం కాకుంటె చెప్పమ్మా!' అనేవారు. ఆయన పద్యం పాడుతుంటే విని తీరాల్సిందే! అల్లసాని పెద్దన రచించిన 'మనుచరిత్ర' లోని 'తీర్థయాత్ర' మాకు పాఠంగా ఉండేది. నరసింహ మూర్తి సార్ పద్యాలు పాడుతూ, ఆ పాఠం చెబుతుంటే.. మేమంతా హిమాలయ పర్వతాలు చూస్తున్నంతగా థ్రిల్ అయ్యేవాళ్లం. అరుణాస్పదపురం నుంచి ప్రవరాఖ్యుడు సిద్ధుడిచ్చిన కాలి పసరుతో హిమాలయాలు చేరుకోవడం, ఆ సౌందర్యానికి ఆనందించడం, ఆ తరువాత పసరు కరిగిపోయి ఎగరలేక బాధపడటం.. ఇవన్నీ మా బుర్రల్లోకి ఇంకేలా, ఎంతో ఆసక్తిగా చెప్పడం మా తెలుగు సార్‌కే చెల్లింది. నిజానికి మా పాఠంలో ప్రవరుడు హిమాలయాలకు చేరుకోవడం మట్టుకే ఉండేది. కానీ, మా నరసింహమూర్తి సార్ మాత్రం.. ఆయన క్లాస్ వెనకే ఒక లీజర్ పీరియడ్ తీసుకోమని మా హెచ్‌ఎం సార్ చెప్పగానే.. ఆ తరువాతి కథ (పాఠంలో లేనిది) కూడా రసవత్తరంగా చెప్పి.. 'నాయినా! మీ పాఠంలో ఉన్నవే చదువుకోండి. హిమాలయ వర్ణన బాగుంటుందని చెప్పాను' అనే సిన్సియారిటీ ఆయనది.

'అటజని కాంచె భూమిసురుడంబరచుంబి శిరస్సరజ్ఝరీ/ పటల ముహుర్ముహుర్లుఠ దభంగ తరంగ మృదంగ నిస్వన/ స్ఫుట నటనానుకూల పరిపుల్ల కలాప కలాపి జాలమున్/ గటక చరత్కరేణు కరకంపిత సాలము శీత శైలమున్' అన్న పద్యం ఆయన చదువుతుంటే మురిసిపోయి ఆ తరువాత బతిమిలాడి నేను రాసుకుని నేర్చుకున్నాను. నాకు తెలియకుండానే కవిత్వమంటే ఇష్టం ఏర్పడటానికి అదే నాంది.

పదో తరగతిలో 'అశ్వత్థామ గర్వభంగము' అనే పద్యపాఠం కూడా ఉండేది. మహాభారత యుద్ధంలో కౌరవులు దాదాపు ఓటమి అంచుకు చేరుకున్నాక.. దుర్యోధనుణ్ని ఎలాగైనా సంతోషపెట్టాలని అశ్వత్థామ 'అపాండవీయం' చేస్తానని హామీ ఇచ్చి.. ద్రౌపది ఐదుగురు కొడుకులను వధిస్తాడు. దుఃఖావేశంలో ఉన్న ద్రౌపదిని ఊరడింప జేయడానికి అర్జునుడు.. అశ్వత్థామను బంధించి ఆమె ముందు నిలబెడతాడు. అప్పుడు ద్రౌపది ఆవేశంతో, ఆవేదనతో పలికిన 'ఉద్రేకంబున రారు శస్త్రధరులై, యుద్ధావనిన్ లేరు, కించిద్ద్రోహంబును నీకు జేయరు, బలోద్రేకంబులో జీకటిన్ భద్రాకారుల చిన్నిపాపల.. రణప్రౌఢ క్రియాహీనులన్ నిద్రాసక్తుల సంహరింప నకటా నీ చేతులెట్లాడెనో ' అన్న మాటలు పద్యరూపంలో సార్ గొంతెత్తి ఆర్తిగా పాడుతుంటే.. మా ఆడపిల్లలం అందరం అందులో లీనమైపోయి కళ్లు తుడుచుకునేవాళ్లం.



ఒక అనుభూతిని వర్ణించడానికి, ఒక భావాన్ని ప్రకటించడానికి, ఒక కథను చెప్పడానికి, ఒక పరిస్థితిని వివరించడానికి, ఒక సంభాషణను రక్తి కట్టించడానికి సాహిత్యం ఎంతగా ఉపయోగపడుతుందో.. పాఠకుణ్ని కూడా ఆ సన్నివేశంలోకి తీసుకెళ్లి సహానుభూతిని పొందేలా చేస్తుందో ఆనాటి తెలుగు ఉపాధ్యాయులు మాకు పరోక్షంగా వివరించి గొప్ప మేలు చేశారు.

నేను ఇంటర్, డిగ్రీల్లో రెండవ భాషగా సంస్కృతం తీసుకున్నా.. పదో తరగతి తరువాత తెలుగు పాఠాలు నేర్చుకోకపోయినా, ఆనాడు మా సార్లు చెప్పిన పాఠాలే ఇంకా గుర్తున్నాయి. తరువాత రోజుల్లో కూడా ఇంటి దగ్గర చాలా తెలుగు పుస్తకాలు ఇష్టంగా చదివి, కొద్దో గొప్పో సాహిత్య సృజన చేశానంటే.. మా అమ్మ, మా తెలుగు ఉపాధ్యాయుల చలువ వల్లనే అని గట్టిగా చెప్పగలను. ఈ సందర్భంగా మా తెలుగు గురువులకు మళ్లీ మళ్లీ దండాలు!! మల్లెపూల దండలు!! ■



**నెల్లుట్ల రమాదేవి**
**రచయిత్రి**